సాక్షి
విజయనగరం
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025

అంబులెన్స్‌కు రంగు పడింది



అత్యవసర వేళ వైద్యసేవలందించే 108 వాహనం రంగు మారింది. కూటమి ప్రభుత్వం పసుపు రంగు పులిమి ప్రచారానికి తెర తీసింది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 2004లో అందుబాటులోకి తీసుకొచ్చిన 108 అత్యవసర అంబులెన్స్‌లపై ఇప్పటివరకు ఏ పార్టీ రంగులు ముద్రించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 108 వాహనాలకు ముందు భాగంలో పసుపు రంగు వేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సీఎం చంద్రబాబు రంగుల రాజకీయాన్ని జిల్లా వాసులు పలువురు దుయ్యబడుతున్నారు.



పట్టణాలకు రోగుల పరుగు..!

గిరిజన, గిరిశిఖర గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వైద్యం కోసం రోగులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

మిత్రమా.. నిన్ను మొక్కల్లో చూసుకుంటాం...




సారిపల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: విజయనగరం రింగ్ రోడ్డులో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో నెల్లిమర్ల మండలం సారిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి అల్తి కుమార్‌గణపతి చనిపోయాడు. స్నేహితుడి జ్ఞాపకార్థం తోటి విద్యార్థులు సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. ప్రజలు పెంచుకునే మొక్కల్లో తమ స్నేహితుడిని చూసుకుంటామని, తాము కూడా మొక్కలు నాటి పెంచుతామని విద్యార్థులు తెలిపారు.

నేరాల నియంత్రణే లక్ష్యం

- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన దామోదర్



ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన దామోదర్

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తామని ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీగా రెండోసారి బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తొలి ప్రాధాన్యమిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఎస్పీకు అడిషనల్ ఎస్పీ సౌమ్యలత, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాస్, బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి, డీపీఓ ఏఓ పి.శ్రీనివాసరావు, లీగల్ అడ్వయిజర్ వై.పరశురాం తదితరులు పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అధికారులకు దిశానిర్దేశం



డీఎస్పీలతో సమావేశమైన ఎస్పీ

ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన దామోదర్ జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. మహిళలు చేస్తున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. పోలీస్ విధులను నిర్వహించడంలో టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు సమష్టిగా ముందుకు సాగాలన్నారు.

ఉపకార వేతనాలకు రిజిస్ట్రేషన్

విజయనగరం టౌన్: ఉపకార వేతనాలు పొందేందుకు విద్యార్థుల వివరాలను జ్ఞానభూమి కళాశాల లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కళాశాల లాగిన్‌లో ఆప్షన్ ఇచ్చామని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు డి.వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందేందుకు, ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థుల వివరాలు ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాలు తమ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అర్హులని పేర్కొన్నారు.

మత్స్యకారులను వీడని.. జెట్టీ చింత..!



చింతపల్లి తీరంలో వేటసాగక ఒడ్డున నిలిపిన బోట్లు

- చింతపల్లి తీరంలో జెట్టీ నిర్మాణానికి గత ప్రభుత్వం చర్యలు
- రూ.23 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- ప్రభుత్వం మారడంతో ఎండమావిగా మారిన ఫ్లోటింగ్ జెట్టీ
- జెట్టీ నిర్మాణంపై ఊసెత్తని కూటమి సర్కారు
- పట్టించుకోని స్థానిక పాలకులు
- మత్స్యకారులకు తప్పని వలస బతుకులు

మత్స్యకారులకు సముద్రమే జీవనాధారం. అలలపైనే జీవన గమనం. వేటసాగితేనే నాలుగు మెతుకులు నోట్లోకి వెళ్లేది. లేదంటే కడలి తీరంలో పస్తుల జీవనం. వరుస తుఫాన్లు వారి బతుకుల్లో అలజడి రేపుతున్నాయి. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇక్కడి మత్స్యకారుల వేట చింత తీర్చేలా, వలసలకు చెక్‌పెట్టేందుకు వీలుగా పూసపాటిరేగ మండలం చింతపల్లి తీరంలో రూ.23 కోట్లతో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి ఉత్తర్వులు జారీచేయడంతో మత్స్యకారుల్లో కొత్త ఆశలు రేకెత్తాయి. ఇంతలో ప్రభుత్వం మారింది. మత్స్యకారులు గొంతెత్తి అరుస్తున్నా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జెట్టీ నిర్మాణం గురించి కనీసం పట్టించుకోకపోవడం ఆవేదన నింపుతోంది.

పూసపాటిరేగ:

విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. సముద్రంలో చేపల వేటపై సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వీరిలో 6 వేల మంది చేపలవేటే ప్రధాన వృత్తిగా జీవిస్తున్నారు. వారిపై పరోక్షంగా 15 వేల మంది ఆధారపడ్డారు. రెండు మండలాల్లో 885 బోట్లలో సుమారు 4 వేల మంది మత్స్యకారులు నిత్యం వేట సాగిస్తుంటారు. జెట్టీ లేకపోవడంతో వేట కష్టాలు వెంటాడుతున్నాయి. తుఫాన్ల సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వేట సాగిస్తున్నారు. జీవనోపాధి కోసం విశాఖపట్టణం, గుజరాత్, హీరావల్, సూరత్ తదితర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారు. అక్కడి ఫిషింగ్ కంపెనీల్లో నెలల తరబడి పనిచేస్తూ కుటుంబ పోషణ కోసం డబ్బులు పంపిస్తున్నారు. వీరిలో చాలామంది సముద్రంలో జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు కూడా విడుస్తున్నారు. స్థానికంగా జెట్టీ లేకపోవడమే మత్స్యకారుల బతుకుకు భరోసా కరువైంది.

జెట్టీ నిర్మించేదెప్పుడు?

పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని మత్స్యకారుల జీవన కష్టాలను గుర్తించిన గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చింతపల్లిలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి రంగం సిద్ధం చేసింది. ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి రూ.23 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. శంకుస్థాపన కూడా చేసింది. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ఉత్తర్వులు మరుగునపడ్డాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణ ప్రక్రియపై నోరుమెదిపేవారే కరువయ్యారు. మత్స్యకారుల కష్టాలు గుర్తించేవారే లేరు. జెట్టీ నిర్మాణంపై ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యాన్ని మత్స్యకారులు తప్పుబడుతున్నారు. మత్స్యకారుల వలస బతుకులు ప్రభుత్వానికి పట్టడం లేదంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వంద రోజుల్లో వంద కంపెనీలు తెస్తామంటూ ఉత్తుత్తి కబుర్లు చెప్పే పాలకులు కనీసం గత ప్రభుత్వం మంజూరు చేసిన ఫ్లోటింగ్ జెట్టీ పనులైనా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇక్కడ వేట సాగకపోవడంతో సుమారు 3వేల మంది వలసలపైనే ఆధారపడి జీవిస్తున్న పరిస్థితులు గమనించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

మత్స్యకారుల కష్టాలు గుర్తించాం..



జిల్లా తీరప్రాంత మత్స్యకారుల కష్టాలను గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించింది. సుమారు 23 కోట్లతో చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా జెట్టీ నిర్మాణం కోసం కనీసం పట్టించుకోకపోవడం విచారకరం. మత్స్యకారులకు జెట్టీ అవసరాన్ని గుర్తించాలి. జెట్టీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. మత్స్యకారులకు జీవన భరోసా కల్పించాలి.

– బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే

ఎదురు చూస్తున్నాం



చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు జెట్టీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేటకు ఎదురీదుతున్నాం. ప్రభుత్వం స్పందించి దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న మత్స్యకారుల కలను సాకారం చేయాలి.

– బర్రి చినఅప్పన్న, జిల్లా మత్స్యకార సహకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం

కాలుష్యంతో మత్స్యసంపద నాశనం..

ఓ వైపు జెట్టీ లేదు.. మరోవైపు పరిశ్రమల రసాయన వ్యర్థాలు సంద్రంలో కలుస్తుండడంతో పూసపాటిరేగ, భోగాపురం తీరంలో చేపలవేట సాగడం లేదు. ఇక్కడ మత్స్య సంపదకు తీవ్ర నష్టం జరుగుతోంది. కొంత కాలం కిందటి వరక వేట అనుకూలించేదని, ప్రస్తుత పరిస్థితి చూస్తే భిన్నంగా ఉందని మత్స్యకారులు వాపోతున్నారు. చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మిస్తే వేట కాస్త అనుకూలంగా మారే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ఎట్టకేలకు డీఎస్సీ ఎంపిక తుది జాబితా విడుదల

- జిల్లాలో 583 నోటిఫైడ్ పోస్టులకు భర్తీ కానున్నవి 578
- 19న విజయవాడలో అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత
- 22 నుంచి 29 వరకు అభ్యర్థులకు రెసిడెన్షియల్ శిక్షణ

ఓసీ, బీసీడీ కేటగిరీకి ఎంపికైన అభ్యర్థుల కటాఫ్ ర్యాంక్‌లు సబ్జెక్టువారీగా...

సబ్జెక్టులు	ఓసీ	బీసీ-డీ మెన్/ఉమెన్
స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్	పోస్టులు లేవు	20/23
స్కూల్ అసిస్టెంట్ హిందీ	పోస్టులు లేవు	9/0
స్కూల్ అసిస్టెంట్ తెలుగు	పోస్టులు లేవు	10/0
స్కూల్ అసిస్టెంట్ బయాలజికల్ సైన్స్	19	23/0
స్కూల్ అసిస్టెంట్ మేథమెటిక్స్	17	19/0
స్కూల్ అసిస్టెంట్ పీడీ	పోస్టులు లేవు	25/63
స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్	పోస్టులు లేవు	29/70
స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్	పోస్టులు లేవు	28/33
ఎస్‌జీటీ	27	145/147

విజయనగరం అర్బన్: ఎట్టకేలకు డీఎస్సీ–2025 టీచర్ పోస్టులకు సంబంధించిన ఎంపిక తుది జాబితాను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. నోటిఫికేషన్‌లో విడుదల చేసిన వివిధ యాజమాన్యాల పాఠశాలల్లో 583 టీచర్ పోస్టుల భర్తీకి గాను 578 పోస్టుల భర్తీకి ఎంపిక జాబితా ప్రకటించారు. మిగిలిన ఐదు పోస్టులకు క్వాలిఫైడ్ అభ్యర్థులు లేనట్లు పేర్కొన్నారు. వాటిలో ఉర్దూ పోస్టులు నాలుగు, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ బీసీ–సీ కోటాకు క్వాలిఫైడ్ అభ్యర్థులు లేకపోవడంతో ఎంపిక చేయడం వీలుకాలేదని ప్రకటించారు. ఎంపికైన వారికి ఈ నెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్టు డీఈఓ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. ఎంపికైన అభ్యర్థితో పాటు సహాయకునిగా ఒకరికి అనుమతిస్తూ మొత్తం 1,156 మందిని విజయవాడ తీసుకెళ్లేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. బస్సులు ఈ నెల 18న మోపాడలోని శిక్షణ కేంద్రం నుంచి బయలుదేరుతాయని, ఎంపికైన అభ్యర్థులు ఆ కేంద్రానికి చేరుకోవాలని కోరారు. ఎంపిక పత్రాలను తీసుకున్న అభ్యర్థులకు ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు బ్యాచ్‌ల వారీగా రెసిడెన్షియల్ శిక్షణ ఉంటుందని, ఆ తర్వాత పోస్టింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటిస్తుందని వివరించారు.

మోక్షగుండంను ఆదర్శంగా తీసుకోవాలి



మోక్షగుండం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపక బృందం

విజయనగరం అర్బన్: ఇంజినీర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి కోరారు. మోక్షగుండం జయంతిని పురస్కరించుకుని వర్సిటీలో సోమవారం ఇంజినీరింగ్ డేను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఇంజినీర్లు ప్రొఫెషనల్‌గానే కాకుండా సోషల్ యాక్టివిటీస్‌లో పాల్గొనాలని కోరారు. దేశాభివృద్ధికి మోక్షగుండం చేసిన కృషిని కొనియాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సివిల్ ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జీజే నాగరాజు, సివిల్ విభాగాధిపతి డాక్టర్ జి.అప్పలనాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.జగన్‌మోహన్ పాల్గొన్నారు.

వైద్యవిద్యను ప్రైవేటుపరం చేయడం సిగ్గుచేటు



విజయనగరం ప్రభుత్వ వైద్యకళాశాల వద్ద కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి

విజయనగరంఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం సిగ్గుచేటని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి అన్నారు. అబద్ధాలను నిజంచేసే టాలెంట్ సీఎం చంద్రబాబుకే సొంతమని ఎద్దేవా చేశారు. విజయనగరం గాజులరేగ వద్ద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించి మూడో ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా సోమవారం సాయంత్రం పార్టీ మహిళా విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో కళాశాల వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత ఫోటోలు చూపించి వైద్య విద్యార్థులు బ్యాగులు సర్దుకుని వెళ్లిపోవాలని హోం మంత్రి అనిత అంటున్నారని, ప్రభుత్వ వైద్య కళాశాలలకు వచ్చి చూస్తే జగన్‌మోహన్ రెడ్డి ఎంత అభివృద్ధిచేశారో తెలుస్తుందన్నారు. విజయనగరం వైద్య కళాశాలలో 220 మందికి పైగా వైద్య సిబ్బంది పనిచేస్తుండగా, 150 మంది వైద్య విద్యార్థులు వైద్య విద్యను అభ్యసిస్తున్న విషయాన్ని గమనించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి విజయనగరం జిల్లా ప్రజల చిరకాల వాంఛను నేరవేర్చారన్నారు. 70 ఎకరాల్లో వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనతి కాలంలోనే రూ.500 కోట్లు ఖర్చుతో నిర్మించి ప్రారంభించారని తెలిపారు. ఆయన కృషి వల్ల ఏడాదికి 150 మంది విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించగలుగుతున్నారని తెలిపారు. నాడు–నేడుతో రాష్ట్రంలో 56 వేల పాఠశాలల రూపు రేఖలు మార్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతోనే కూటమి సర్కారు వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే వైద్య విద్యార్థులు నష్టపోతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు సాయికుమార్ పాల్గొన్నారు.

అక్షరమే ఆయుధం



కూటమిది నియంతృత్వ పాలన



ప్రజాస్వామ్య సమాజంలో పత్రికాస్వేచ్ఛ చాలా ముఖ్యం. మీడియా గొంతు నొక్కుతూ కూటమి ప్రభుత్వ నియంతృత్వపాలన చైనాను తలపిస్తోంది. ఒక నాయకుడు ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన అంశాలు ప్రచురిస్తే కేసులు పెట్టడం, కక్షసాధింపులకు పాల్పడటం అనైతికం. ప్రజాసమస్యలను వెలికితీస్తున్న అక్కసుతో సాక్షి దినపత్రిక ఎడిటర్‌తో సహా పాత్రికేయ సిబ్బందిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు సిగ్గుచేటు. ఇదే తీరు కొనసాగిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పదు. ప్రభుత్వం హుందాతనంగా వ్యవహరించాలి.

– కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే, ఎస్.కోట

వాస్తవాలు రాస్తే కేసులా?



ప్రజలకు తెలియజేయడం కోసం వాస్తవాలు రాస్తే కూటమి ప్రభుత్వం పోలీసులతో మీడియా ప్రతినిధులపై కేసులు పెట్టించడం తగదు. విలేకరుల సమావేశంలో ఓ ప్రజాప్రతినిధి చెప్పిన మాటలను వార్తగా రాసిన పాత్రికేయులపై కేసుపెట్టడం ఇదే తొలిసారి. నిజాలు వెలికితీస్తున్న 'సాక్షి'పై కూటమి ప్రభుత్వం అక్కసు పెంచుకుంది. తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోంది. ఇది పిరికిపంద చర్య. పత్రికాస్వేచ్ఛకు, వాక్ స్వాతంత్ర్యపు హక్కులకు భంగం కలిగించరాదు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడమే జర్నలిస్టుల పని.

– బొత్స అప్పలనరసయ్య, మాజీ ఎమ్మెల్యే, గజపతినగరం నియోజకవర్గం

పత్రికా స్వేచ్ఛను హరించడం దుర్మార్గం



పత్రికా స్వేచ్ఛను హరించడం దుర్మార్గమైన చర్య. రాష్ట్రంలో కూటమి సర్కారు అన్ని వర్గాలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ప్రెస్ మీట్‌లో ప్రజాప్రతినిధుల మాటలను వార్తగా రాస్తే కేసులు పెట్టడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు, ఉద్యోగవర్గాల సమస్యలను వెలికితీస్తున్న సాక్షి పత్రికపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. రాజకీయనాయకులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు రాస్తే విలేకరులు, ఎడిటర్‌లపై కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదు. రానున్న రోజుల్లో ప్రజావ్యతిరేక పాలన చేస్తున్న కూటమి సర్కారుకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు.

– బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే

ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలి



ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా తలపెట్టిన నిరసన వారంలో భాగంగా రాజాం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుచేసి మెమో 57ను అమలు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులు లంక రామకృష్ణ, ఎలకల భాస్కరరావు, నల్ల రవికుమార్, ఎందువ సీతంనాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ మీసాల సత్యంనాయుడు, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీఆర్కే నాయుడు, బెవర శ్రీనివాసరావు, వి.తారకేశ్వరరావు, శెట్టి శివరావు, వై.రామకృష్ణ, పి.శ్రీకర్, డి.మహేష్, వై.గౌరినాయుడు, రాజేశ్వరి, మాధురి, గీత తదితరులు పాల్గొన్నారు.

– రాజాం సిటీ

విద్యుత్ ఉద్యోగుల పోరుబాట



విద్యుత్ సంస్థలో దీర్ఘకాలంగా ఉన్న అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం దాసన్నపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఉద్యోగులు సోమవారం ధర్నా చేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నాయన్నారు. ఉద్యమాలతో సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబట్టారు. జిల్లా కేంద్రంలో 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు, 22న జిల్లా కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు మెమొరాండం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ సురగాల లక్ష్మణ్, కన్వీనర్ బండారు రాజేష్‌కుమార్, కో చైర్మన్ పి.అప్పలస్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం ఫోర్ట్

మోసం చేశారు.. ఆదుకోండి



రాజాంలోని ఓ ప్రైవేటు ఏజెన్సీ వద్ద గంగోత్రి రకం విత్తనాలు కొనుగోలు చేశాం. సుమారు 350 ఎకరాల్లో సాగుచేశాం. నాసిరకం విత్తనాలు కావడంతో కేళీలు వచ్చాయి. పంట సమయానికి ముందే కంకులు వచ్చాయి. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకుంది. ఆ ఏజెన్సీపై చర్యలు తీసుకుని ఎకరాకు రూ.50వేలు చొప్పున పరిహారం ఇప్పించాలంటూ రాజాం మండలంలోని నాయుడువలస, అమరాం గ్రామ రైతులు జిల్లా అధికారులను వేడుకున్నారు. వరి దుబ్బులను తెచ్చి కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. రైతు కష్టాన్ని గుర్తించి న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు లోకవరపు ఆదినారాయణ, జి.వెంకటరమణ, ఎం.రామభగవన్‌దాసు, చిన్నంనాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరంఫోర్ట్

వీడని యూరియా కష్టాలు



గంట్యాడ మండలం కొరారుబిల్లి ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు, (ఇన్‌సెట్లో) గజపతినగరం పీఏసీఎస్‌కు యూరియా కోసం వచ్చి సొమ్మసిల్లిన వృద్ధురాలు

రోజులు తరబడుతున్నా యూరియా కష్టాలు వీడడం లేదు. పంటకు జల్లుకునేందుకు సరిపడా ఎరువు రైతు చేతికి అందడం లేదు. డబ్బులిచ్చి కొనుగోలుచేసుకునే ఎరువుకోసం పీఏసీఎస్‌లు, ఆర్‌ఎస్‌కేలు, ప్రైవేటు దుకాణాల వద్ద రైతన్నలు పడికాపులు కాస్తున్నారు. గజపతినగరం పీఏసీఎస్ వద్ద, లోగిశ ఆర్‌ఎస్‌కేల వద్ద జరిగిన తోపులాటల్లో పలువురు రైతులు కిందపడిపోయారు.

– విజయనగరం ఫోర్ట్

క్లుప్తంగా

రైల్లో తనిఖీలు



రాయిపూర్ పాసింజర్‌లో తనిఖీలు చేస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి, డాగ్‌స్క్వాడ్

పార్వతీపురం రూరల్: గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నివారించేందుకు ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రాయపూర్ పాసింజర్ రైల్లో జీఆర్పీ, ఆర్పీఎఫ్, డాగ్‌స్క్వాడ్, ఈగల్ టీం సంయుక్తంగా పార్వతీపురం రూరల్ సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషికుమారి తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో, భోగీలలో ప్రయాణికుల లగేజీలను, అనుమానితులను తనిఖీ చేసినట్లు ఆమె చెప్పారు.

అప్రమత్తంగా ఉండి సమాచారం ఇవ్వండి

సాలూరు పట్టణంలో సోమవారం జరిగిన చైన్స్ స్నాచింగ్‌కు సంబంధించిన నిందితులు తప్పించుకుని తిరుగుతున్నారని, ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరి మీదనైనా అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సంతోషి కోరారు. ఈ సందర్భంగా నిందితులు పరారవుతున్న సీసీ కెమెరాల్లో రికార్డ్ అయిన చిత్రాలను ఆమె విడుదల చేశారు.

భవనంపై నుంచి జారిపడి కార్మికుడి మృతి



ఆరిక మోహనరావు మృతదేహం

పార్వతీపురం రూరల్: జిల్లాకేంద్రంలోని సౌందర్య థియేటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనం పైనుంచి శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆరిక మోహనరావు(43) అనే వ్యక్తి నిద్రిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి మరణించాడు. ఈ మేరకు ప్రాథమిక విచారణలో నిర్ధారించినట్లు పార్వతీపురం పట్టణ ఎస్సై గోవింద తెలిపారు. మృతుడు కిందికి ప్రమాదవశాత్తు జారిపడిన సమయంలో సమీపంలో గల కళాశాల విద్యార్థి ఒకరు చూసినట్లు ఎస్సై చెప్పారు. కురుపాం మండలం ఒబ్బంగి పంచాయతీ లిక్కిడిగూడ గ్రామానికి చెందిన మోహనరావు భార్య సుహాసిని ఇటీవల మరణించింది. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు సత్యవతి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి రమణ తదితరులు

సాలూరు: పట్టణంలోని రామాకోలనీలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఇద్దరు వ్యక్తులు చోరీ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామా కాలనీకి చెందిన అక్కేరపు సత్యవతి(65) సోమవారం మధ్యాహ్నం ఇంటిలో నిద్రిస్తుండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి ఇంటి తలుపుకొట్టడంతో ఆమె బయటకు వచ్చింది.ఆమెకు ఇంటిపక్కనే ఖాళీగా ఉన్న రెండో ఇల్లు అద్దెకు కావాలని, ఇల్లు చూపించమని ఆ వ్యక్తులు కోరారు. ఈ క్రమంలో ఇంట్లో బెడ్ రూం ఎక్కడ ఉందో చూపించమనగా ఆమె ఇంటిలోకి వెళ్లింది. దీంతో ఓ వ్యక్తి ఆమె చేతులను గట్టిగా పట్టుకోగా రెండో వ్యక్తి ఆమె మెడలో గల సుమారు 5 తులాల బంగారు గొలుసును తెంపేసి వెంటనే ఓ స్కూటీపై పరారయ్యారు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా అప్పటికే దొంగలు పారిపోయారు. తరువాత ఆమె స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు తాడ్డి రమణ తదితరులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

పట్టణాలకు రోగుల పరుగు..!



జిల్లా ఆస్పత్రిలో వైద్యం నిమిత్తం క్యూలో నిల్చున్న గ్రామస్తులు

- నాడు ఇళ్లవద్దకే వైద్యసేవలు
- నేడు ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి
- గిరిజన ఆరోగ్యంపై సర్కారు చిన్నచూపు



సీతానగరం మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు(ఫైల్)

పార్వతీపురంటౌన్: అసలే వర్షాకాలం. సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు, విషజ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఎక్కువగా ఉంది. గిరిజన, గిరిశిఖర గ్రామాల్లో విషజ్వరాలు విలయ తాండవం చేస్తున్నాయి. గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవల్సిన ప్రభుత్వం, యంత్రాంగం గిరిజనుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజన గ్రామాల్లో ఇంటికో జ్వరపీడితుడు ఉన్నా తూతూ మంత్రంగానే వైద్యసేవలు అందుతున్నాయి తప్ప తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గ్రామాల్లో సరిగ్గా వైద్యసేవలు అందక, పీహెచ్‌సీల్లో సరైన వైద్యం అందక పట్టణాల్లో గల ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీసి వైద్యం చేయించుకోవల్సిన దుస్థితి గిరిజనులకు ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి గ్రామాల్లోనే సూపర్ స్పెషలిస్ట్ వైద్యులతో వైద్యశిబిరాలను నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సల నిమిత్తం కార్పొరేట్ వైద్యాన్ని ప్రజల వద్దకు తీసుకువచ్చారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ఆరోగ్య సమస్య తలెత్తరాదనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గతంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రతి గ్రామంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఇళ్లవద్దనే పరీక్షలు నిర్వహించి గ్రామాల్లోనే 105 రకాల మందులను అందజేసి గిరిజనుల ఆరోగ్యానికి భద్రత కల్పించారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదని, గిరిజనులంతా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్యానికి భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

నాడు 1,42,191 మందికి గ్రామాల్లోనే వైద్యసేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గిరిజన, మైదాన గ్రామాల్లో కార్పొరేట్ వైద్యులతో వైద్యశిబిరాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 364 వైద్యశిబిరాలు నిర్వహించి 1,42,191 మందికి వైద్య సేవలు అందించారు. అందులో 91,178మందికి బీపీ, 4,571మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించి చికిత్స, వారికి అవసరమైన మందులను అందజేశారు. 2,547మందిని వివిధ రోగాల నిమిత్తం వారిని గుర్తించి మెరుగైన వైద్యసేవల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి రిఫర్‌చేయగా 2,316 మందికి చికిత్స పొందారు. 18,773 మందికి కంటివైద్యపరీక్షలు నిర్వహించి 1260మందికి కేటరాక్ట్ సమస్య గుర్తించి 232మందికి శస్త్రచికిత్స పూర్తిచేశారు. ఈ శిబిరాల్లోనే 1,229మందికి కళ్లజోళ్లను అందజేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇళ్లవద్దకే వైద్యసేవలు

దేశంలో ఎక్కడా లేని విధంగా గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రతిరోజూ గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం వైద్యసేవలు అందించింది. గిరిజన గ్రామాల్లో మంచాన పడి ఉన్న గర్భిణులు, వృద్ధుల ఇళ్లవద్దకే వెళ్లి ఉదయం సమయంలో వైద్యసేవలు అందించి మధ్యాహ్న సమయంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి వైద్యసేవలను అందించేవారు. గ్రామాల్లోనే రక్తపరీక్షలు నిర్వహించి రోగాలను గుర్తించి మందులను అందించేవారు. పట్టణాలకువెళ్లే పరిస్థితి లేకుండా గ్రామాల్లోనే 105 రకాల మందులను అందుబాటులో ఉంచేవారు.

ఆ పరిస్థితి కానరాదు

గ్రామాల్లో గతంలో మాదిరి వైద్యసేవలు అందే పరిస్థితి ప్రస్తుతం లేదు. తూతూ మంత్రంగానే 104 వాహనాల ద్వారా వైద్యసేవలు అందించి మమ అనిపిస్తున్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు, మారుమూల గ్రామస్తులు వేడుకుంటున్నారు. సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతూ దూరప్రాంతాలకు ప్రయాణం చేసి ఆస్పత్రుల వద్ద లైన్‌లో నిలబడి వైద్యం పొందాల్సిన దుస్థితి ఉందని ప్రభుత్వం, యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో వైద్యసేవలు, రక్తపరీక్షలు, మందులు, వైద్య శిబిరాలు అందుబాటులోకి తీసుకువచ్చి గిరిజన ఆరోగ్యానికి భద్రత కల్పించాలని ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

వైద్యశిబిరాల నిర్వహణకు ప్రణాళికలు



జిల్లాలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నందున వైద్య శిబిరాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ప్రస్తుతం 104 సంచార వాహనాల ద్వారా వైద్యసేవలందిస్తున్నాం. వైద్యశిబిరాల నిర్వహణకు సంబంధించి వైద్యులను అందుబాటులో ఉంచాం. అతి త్వరలో గ్రామాల్లో వైద్యశిబిరాలను నిర్వహించి గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తాం. – ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం

ఆందోళన వద్దు.. వదంతులు నమ్మవద్దు

- రూరల్ సీఐ రంగనాథం



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ రంగనాథం

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామ సమీపంలో గల నేలబావి వద్ద ఉన్న దుర్గాదేవి ఆలయంలో విగ్రహం ధ్వంసం జరిగిందన్న ఘటనపై పార్వతీపురం రూరల్ సీఐ రంగనాథం, ఎస్సై సంతోషికుమారి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జరిగిన ఘటనపై వివరించారు. కొన్నేళ్ల క్రితం అమ్మవారి విగ్రహంలో ఎడమచేయి శిథిలమవడంతో మరమ్మతులు చేసి స్థానిక భక్తులు ఏర్పాటు చేశారని ఈ మేరకు క్రమేణా మళ్లీ అదే చోట శిథిలమైనట్లు తమకు సమాచారం వచ్చిన వెంటనే క్లూస్‌టీం ద్వారా పరిశీలించి, అ స్థానిక గ్రామ పెద్దలు, భక్తులతో మాట్లాడి విచారించిన అనంతరం ఎలాంటి విధ్వంస చర్యలు జరగలేదని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఎవరూ ఆందోళన చెందనవసరంలేదని, అలాగే ఇలాంటి సున్నితమైన విషయాలు, వదంతాలు స్పష్టత లేకుండా నమ్మవద్దని తెలిపారు.

జనసేన మండల అధ్యక్షుడిపై పిర్యాదు



ఐటీడీఏ పీఓకు వినతి ఇస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు



ఎంపీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

సీతంపేట: సోషల్ మీడియా వేదికగా సర్పంచ్‌లను దుర్భాషలాడినందుకు జనసేన పార్టీ సీతంపేట మండల అధ్యక్షుడు మండంగి విశ్వనాథంపై కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీఓలకు ఫిర్యాదు చేసినట్లు మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 73వ రాజ్యాంగ సవరణలో ఆర్టికల్ 243 ప్రకారం రాజ్యాంగం 11వ భాగం ప్రకారం రాజ్యాంగ బద్ధంగా ఎన్నికై గౌరవప్రదమైన పదవుల్లో ఉన్న వ్యవస్థపై అసభ్యపదజాలం, పోస్టింగ్‌లతో కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విశ్వనాథంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నికైన తాము ఏనాడు పార్టీల పరంగా భేదాభిప్రాయాలు తలెత్తేలా నడుచుకోలేదన్నారు. ఇప్పుడు జనసేన నాయకుడు సర్పంచ్‌లను దొంగ నాకొడుకులు అంటూ అసభ్యంగా పెట్టిన పోస్టులు తమ మనోభావాలు పూర్తిగా దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. శాంతిభద్రతలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన విశ్వనాథంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్‌లు ఎస్.తిరుపతిరావు, కె.వెంకునాయుడు, ఎస్.బాపయ్య, హెచ్.ఆదిలక్ష్మి, జె.సుందరమ్మ, బి.తిరుపతిరావు, ఎస్.ప్రవీణ్, ఇసోని, రాజయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖర్, ఎస్.మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

- జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖాధికారులు

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఈనెల 17వ తేదీ బుధవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరగనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన బ్యానర్లు, పోస్టర్లను సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, వీఆర్‌ఓ హేమలత, ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డీఎంహెచ్‌ఓ డా.ఎస్.భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ డా.జి. నాగభూషణరావు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు లతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పారామెడికల్ సిబ్బంది ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులతో నిర్వహించనున్నందున అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలు, గర్భిణులు, బాలింతలు ఈ శిబిరాలకు తీసుకు రావాలని ఏఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశవర్కర్లు మాత్రమే కాకుండా జిల్లా, మండల గ్రామస్థాయిలో వైద్యశాఖ, మహిళా శిశుసంక్షేమశాఖతోపాటు స్థానిక ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది మహిళలకు అవగాహన కల్పించి వైద్య శిబిరాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, మరికొంతమంది జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు 37 మంది ఎంపిక



బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ బాల, బాలికల బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించారు. అండర్–14 విభాగంలో బాలురకు, అండర్–17 విభాగంలో బాల, బాలికలకు నిర్వహించిన పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 200మందికి పైగా క్రీడాకారులు హాజరై పోటీ పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ బరువుల కేటగిరీల వారీగా ఎంపికలు నిర్వహించగా రెండు విభాగాల్లో మొత్తం 37 మంది క్రీడాకారులు జిల్లా జట్టుకు అర్హత సాధించినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మిలు తెలిపారు. పోటీలను బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్ ప్రారంభించగా..శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, ఖేలో ఇండియా కోచ్ సీతారామంజనేయులు పర్యవేక్షించారు. పోటీలకు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

జూనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

- 23 నుంచి ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో పోటీలు



రాష్ట్రస్థాయి జూనియర్స్ కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్‌క్రీడామైదానం ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 120 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. బాల, బాలికల విభాగాల్లో నిర్వహించిన ఎంపికలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ ఎంపికల్లో బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 14 మంది క్రీడాకారులు, బాలికల విభాగంలో మెరుగైన ఆట తీరు కనబరిచిన 14 మంది క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23 నుంచి 26వరకు ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరగనున్న అంతర్ జిల్లాల జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావులు తెలిపారు. ఎంపిక పోటీలను అసోసియేషన్ కోశాధికారి బి.శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు నగేష్‌కుమార్, కొవ్వాడ శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు తాడుబాబు, గోపాల్, మీసాల.శ్రీనివాసరావు, మజ్జి తిరుపతిరావు, సారిపల్లి గౌరీశంకర్, సౌదామిని, పి.ఆదినారాయణలు పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు నలుగురి ఎంపిక

- అక్టోబర్ 8 నుంచి నోయిడాలోపోటీలు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న టెన్నికాయిట్ అసోసియేషన్ సెక్రటరీ రామారావు

చీపురుపల్లి: జాతీయస్థాయిలో జరగనున్న టెన్నికాయిట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఆడేందుకు జిల్లాకు చెందిన నలుగురు ప్రధాన క్రీడాకారులు, ఇద్దరు అదనపు క్రీడాకారులు ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్రధాన క్రీడాకారుల్లో ముగ్గురు మహిళల విభాగం నుంచి కాగా ఒకరు పురుషుల విభాగం నుంచి ఎంపికయ్యారు. ఈ నెల 13, 14 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లాలోని మండపేటలో నిర్వహించిన 49వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఆ పోటీల్లో జిల్లాలోని గరివిడి మండలం కేవీఎల్.పురానికి చెందిన ఆర్.మౌనిక ప్రథమ స్థానంలో నిలవగా పి.రేణుక తృతీయస్థానం, జి.శ్రావణి నాల్గవ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఈ ముగ్గురిది ఒకే గ్రామం కావడం విశేషం. అలాగే చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లి గ్రామానికి చెందిన కె.ఇందు అదనపు క్రీడాకారిణిగా ఎంపికైంది. అలాగే పురుషుల విభాగంలో పార్వతీపురానికి చెందిన ఎస్.రాహుల్ నాల్గవ స్థానంలో నిలిచి ప్రధాన క్రీడాకారుడిగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అంతేకాకుండా పురుషుల విభాగంలో విజయనగరానికి చెందిన కె.చంద్రమౌళిని అదనపు క్రీడాకారుడిగా ఎంపిక చేశారు. ఇది ఇలా ఉండగా అక్టోబర్ 8 నుంచి 13 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడా పట్టణంలో గల ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జరగనున్న జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో వీరు రాష్ట్రం తరఫున ఆడనున్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన టెన్నికాయిట్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ఎం.రామారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో చక్కని ప్రతిభ కనపరిచి రాష్ట్రంతో బాటు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

పెంటాతిలిన్ పోటీల్లో రావాడ విద్యార్థి ప్రతిభ



పెంటాతిలిన్ పోటీల్లో కాస్య పతకం పొందిన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భోగాపురం: ఈ నెల 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని బిగుసరాయ్ వద్ద గల బీహట్ గ్రౌండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పెంటాతిలిన్ పోటీల్లో భోగాపురం మండలం రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి అమనాపు భీష్మ కాస్య పతకం పొందాడు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఏ సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీష్మకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు నచ్చిరెడ్డి సూర్యనారాయణతో పాటు పాఠశాల సిబ్బంది ఆ విద్యార్థిని అభినందిచారు.

పశువుల కంటైనర్ బోల్తా



బోల్తా పడిన పశువుల కంటైనర్



ప్రమాదం తర్వాత బయటకు తీసిన పశువులు

బొండపల్లి: మండలంలోని నెలివాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారి26పై గజపతినగరం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న పశువుల కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. సోమవారం వేకువ జామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. పశువులను రవాణా చేస్తుండగా కంటైనర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి బోల్తా పడి పోయింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు పశువులకు ఎటువంటి ప్రమాదం జరగనప్పటికీ హుటాహుటిన లారీ యాజమాన్యంతో పాటు పశువులను రవాణా చేస్తున్న వారు భారీ క్రేన్లు తీసుకువచ్చి లారీని బయటకు తీసి, అలాగే లారీలో రవాణా చేస్తూ ప్రమాదంలో చెల్లాచెదురైన పశువులను బయటకు తీసి వాటిని వేరే వాహనంలో గుట్టుచప్పుడు కాకుండా పోలీసులకు తెలియకుండా తరలించారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సమర్పించే అర్జీదారుల వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలపి పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన అధ్యక్షతన జరిగిన పీజీఆర్ఎస్‌లో సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి, డీఆర్‌ఓ కె.హేమలత, సబ్‌కలెక్టర్ ధర్మ చంద్రారెడ్డిలు అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలలో కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన ధాత్రిశ్రీ తల్లికి వందనం డబ్బులు జమకాలేదని, జిల్లా కేంద్రంలోని కొత్తవలసకు చెందిన రౌతు పారినాయుడుకు పింఛన్ మంజూరు చేయాలని, వెంకటసాగరం ఆయకట్టులో 40 ఎకరాలకు సక్రమంగా నీరు అందించాలని సీతానగరం మండలం అంకలాం రైతులు కోరారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు పరిష్కారం చూపండి

పార్వతీపురం రూరల్: ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధిత పోలీసుశాఖ అధికారులు జవాబుదారిగా వ్యవహరించి పరిష్కారం చూపాలని ఏఎస్పీ అంకితా సురానా అన్నారు. అలాగే నిర్దేశించిన సమయంలోనే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, బాధితులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వచ్చిన 10 ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ ఆదాం, ఎస్సై రమేష్‌నాయుడు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 42 అర్జీలు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 42 అర్జీలు వచ్చాయి. ముగడపేటకు చెందిన రమణమ్మ హౌసింగ్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి అందజేసింది. యోగా టీచర్ పోస్టు ఇప్పించాలని మండ గ్రామానికి చెందిన సవర శ్రీను, కొండపోడు పట్టాలు ఇప్పించాలని బంజారుపేట గిరిజనులు కోరారు. జీజీవలస గ్రామస్తులు శ్మశానవాటికకు సీసీ రోడ్డు, ప్రహరీని నిర్మించాలని వినతులు అందజేశారు. పెద్దగూడకు చెందిన సవర మంగయ్య బ్యాటరీ స్ప్రేయర్ ఇప్పించాలని, కమ్యూనిటీహాల్ మంజూరు చేయాలని కరడంగివలస గ్రామస్తులు కోరారు. పీజీఆర్ఎస్‌లో ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, డిప్యూటీఈవో రామ్మోహన్‌రావు, ఉపవైద్యాధికారి విజయపార్వతి, ఏపీడీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారు సంతృప్తి చెందాలి

- డీఆర్‌ఓ ఎస్. శ్రీనివాసమూర్తి



వినతుల స్వీకరణలో డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కారం వేదికకు వచ్చే వినతులను సకాలంలో పరిష్కరించాల్సిన బాధ్యత జిల్లా అధికారులదేనని డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి స్పష్టం చేశారు. ఫిర్యాదులు పరిష్కరించే ముందు నోటీసులు జారీ చేసి విచారణ చేసి రికార్డు చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గడువులోగా వినతులకు పరిష్కారం చూపని ఎడల సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ప్రజల నుంచి మొత్తం 162 వినతులు స్వీకరించారు. వినతుల స్వీకరణలో డీఆర్‌ఓతోపాటు డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, ప్రమీలా గాంధీ పాల్గొన్నారు.